

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## జి.కె.వెంకటేశ్

### (విజయచిత్ర – 1973, సెప్టెంబర్ సంచిక నుంచి)



అత్తగారు – కొత్త కోడలు, నాటకాల రాయుడు, మా యిలవేల్పు, శ్రీదేవి, కోడలుపిల్ల, శ్రీవారు – మా వారు, దేవీ లలితాంబ, తల్లీ కొడుకులు మొదలైన తెలుగు చిత్రాలకూ, 15 మాసాలకు పైగా ఒకే థియేటర్లో (బెంగళూరు) నడుస్తున్న 'బంగారదమనుష్య' మొదలైన నూరు కన్నడ చిత్రాలకూ సంగీత దర్శకునిగా పనిచేసి పేరు గడించిన జి.కె.వెంకటేశ్ – కొన్ని మలయాళ చిత్రాలకూ మరికొన్ని తమిళ చిత్రాలకూ కూడా సంగీత దర్శకుడిగా పనిచేశారు ! మొత్తం 150 చిత్రాలు ఆయన సంగీత దర్శకత్వంలో తయారైన చిత్రాలు. అయితే, తెలుగులో ఎక్కువ చిత్రాలకు పనిచెయ్యకపోవడం వల్ల – వెంకటేశ్ గురించి ఈ మాట విన్నప్పుడు, విన్నవారికి ఆశ్చర్యంగానే ఉండొచ్చు, ఆయన తెలుగువారే అయినా, తెలుగు సినిమాలకు పనిచెయ్యడానికి చాలా ముందు – మలయాళ, కన్నడ తమిళ చిత్రాలకు పనిచేసి – పేరు తెచ్చుకున్న వార్త విన్నప్పుడు కూడా ఆశ్చర్యం కలగొచ్చు ...

వెంకటేశ్ స్వస్థలం హైదరాబాదు; మద్రాసులో పెరిగాడు. వింత ఏమిటంటే – అతను ఏ నాడూ స్కూలుకు వెళ్ళి పాఠం చదివి ఎరగడు. చిన్నతనం నుంచి, అతని చెవులు, కళ్ళూ ఎప్పుడూ సంగీతం మీదనే వుండేవి. వెంకటేశ్ తండ్రిగారు సంగీత విద్వాంసుడు; రంగస్థల నటుడు. ఆయన ఐదుగురు అబ్బాయిలకూ సంగీతం అలవడింది. ఒక్కొక్కరు ఒక్కొక్క వాద్యంలో కృషి చేశారు. వెంకటేశ్ పెద్దన్నయ్యగారైన సీతాపతిగారు, వెంకటేశ్కు సంగీతం నేర్పారు. తన ఆరవ ఏటనే వెంకటేశ్ వీణ వాయించడం నేర్చుకున్నాడు.

1938 వ సంవత్సరంలో, తన పదకొండవ ఏట వెంకటేశ్ మద్రాసు వచ్చేసి, స్థిర వాసం ఏర్పరచుకున్నాడు. అంతకు ముందు అతను తండ్రిగారి ప్రోత్సాహంతో నాటకాల్లో వేషాలు కూడా వేశారు. ఆ ఉత్సాహంతో అతను సినిమా ఉత్సాహం పెంచుకుని, మద్రాసులో స్థిరపడితే, 'సినిమా అవకాశాలు మాత్రం రావా' అనుకున్నాడు. అతని ఊహ ఫలించింది. జూపిటర్ సంస్థ వాళ్ళు అతన్ని తమ సంస్థలో జేర్చుకున్నారు. బస, భోజనాలు వాళ్ళే ఏర్పాటు చేసి, నెలకు 'మూడు రూపాయలు' జీతం ఇచ్చే వారు. వెంకటేశ్ పిల్లల వేషాలు వేస్తూ వచ్చాడు. తమిళ భాష అప్పటికి అంతగా తెలియకపోయినా, ఎలా చెబుతే అలా చెప్పడం అలవాటు చేసుకుని – కణ్ణగి, కుబేర కుచేల, మహామాయ, భక్త మీరా మొదలైన చిత్రాల్లో వేషాలు వేశాడు. నేటి ప్రసిద్ధ సంగీత దర్శకుడు యమ్. యస్. విశ్వనాథన్ కూ మైత్రి ఏర్పడింది. అప్పుడే ఆ అబ్బాయిలు జూపిటర్ సంస్థ – ఏ పని చెబుతే ఆ పని చెయ్యాలి. కేవలం వేషాలు వెయ్యడమే కాకుండా, ఆర్కెస్ట్రాలో పాల్గొనడం, కోరస్ పాటల్లో పాడడం కూడా చేసేవారు. కడారు నాగభూషణం గారు తమిళంలో 'హరిశ్చంద్ర' తీశారు. అందులో ఇద్దరూ లోహితాస్యుడి స్నేహితులుగా వేషాలు వేశారు. ఆ తర్వాత, వెంకటేశ్ నటించలేదు. సంగీత శాఖలోనే కృషి చెయ్యసాగాడు.

కె. వి. నాయుడు అనే ఆయనకు ఆర్కెస్ట్రా వుండేది. వెంకటేశ్ అందులో జేరి, చిత్రాలకు పని చెయ్యసాగాడు. కె.వి నాయుడు ద్వారా, వెంకటేశ్ కు సంగీత దర్శకుడు యస్. వెంకటరామన్ పరిచయం ఏర్పడింది. ఆయన దగ్గర సహాయకుడిగా పని చేసే అవకాశం కలిగింది – వెంకటేశ్ కు. తర్వాత, సి. ఆర్. సుబ్బరామన్ తో పరిచయం ఏర్పడి, ఆయన ద్వారా కోయంబత్తూరు పక్షి రాజా స్టూడియోలో జేరి, రెండేళ్ళ పాటు సుబ్బరామన్ సంగీత దర్శకత్వంలో ఆర్కెస్ట్రాలో పని చేశారు.

వెంకటేశ్ కృషి, ముందుకు రావాలన్న అతని తపనా పరిశ్రమకు తెలియసాగాయి. టి. జానకి రామ్ అనే ఆయన 'చేచి' అన్న మలయాళ చిత్రం ఆరంభిస్తూ కొత్త సంగీత దర్శకునికి అవకాశం ఇవ్వాలనుకుని, వెంకటేశ్ కు ఇచ్చారు. సంగీత దర్శకునిగా అతని తొలి చిత్రం అది. ఆ తర్వాత, సేలంలో కొంత కాలం వుండి, ఇంకో రెండు మలయాళ చిత్రాలకు సంగీత దర్శకుడిగా పని చేశారు. 1953 లో మద్రాసు వచ్చి, విశ్వనాధన్, రామ్మూర్తి బృందంలో జేరి, వాళ్ళతో కలిసి చాలా చిత్రాలకు పని చేశారు. వాళ్ళతో కలిసి పని చేస్తూనే బయటి చిత్రాలకు కూడా సొంతంగా పని చేశారు. 54లో ఆయన 'సోదరి' అనే కన్నడ చిత్రానికి సంగీత దర్శకుడైనారు. నాటి నుంచి, నూరు కన్నడ చిత్రాలకు పని చేశారు. ఎన్నో సార్లు 'ఉత్తమ సంగీత దర్శకుడు' బహుమతులు కూడా పుచ్చుకున్నారు. వెంకటేశ్, సంగీత దర్శకుడైన తర్వాత, కొన్ని చిత్రాల్లో పాటలు కూడా పాడారు – పని చేసిన అన్ని భాషా చిత్రాల్లోనూ. తెలుగులో 'సంతోషం', 'శ్రీదేవి' మొదలైన చిత్రాల్లో పాడారు.

హరి అనే మిత్రుని ద్వారా, కల్పన చిత్ర నిర్మాత బాబూరావుతో వెంకటేశ్ కు పరిచయం ఏర్పడింది. అప్పుడే అతను బాబూరావు తీసిన 'అత్తగారు – కొత్త కోడలు' చిత్రానికి – తొలిసారిగా తెలుగు చిత్రానికి – సంగీత దర్శకుడైనారు. 'అత్తగారు – కొత్త కోడలు' చిత్రాల్లోని పాటలు, ప్రజలను ఆకట్టుకోవడంతో వెంకటేశ్, తొలి చిత్రంతోనే తెలుగు ప్రేక్షకులకు బాగా తెలిసిపోయారు ! ప్రస్తుతం ఆయన ఆరు కన్నడ చిత్రాలకూ రెండు తమిళ చిత్రాలకూ పనిచేస్తున్నారు. గౌరీశంకర్, బి. యస్. నారాయణ, యమ్. మల్లికార్జునరావులు త్వరలో ఆరంభించే తెలుగు చిత్రాలకు పని చేస్తారు. ఆయన సంగీత దర్శకత్వంలో తయారైన 'పసి హృదయాలు' త్వరలో విడుదల కాబోతున్నది.

"సినిమా సంగీత దర్శకులు ఒక భాషలో హిట్టయిన పాటల్ని ఎందుకు కాపీ కొడతారు?" అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ – "సినిమాలకు సినిమాలే కాపీలే కొట్టగా, బాగున్న ట్యూన్ ను తీసుకుంటే తప్పా? ఆ వరస ఇక్కడి సన్నివేశానికి అమరగలదనుకుంటే, కుదుర్చుకోవచ్చు. అయితే, ఇలా కాపీ చెయ్యడానికి కారకుడు నూరువంతులూ సంగీత దర్శకుడే కాదు. దర్శక నిర్మాతలు కూడా కారకులే అవుతారు. వారి ప్రోద్బలం లేనిదే, ఏ సంగీత దర్శకుడూ ముందుగానే, "కాపీ చేస్తాను" అని అనడు !" అన్నాడు వెంకటేశ్.

"ప్రతి సంగీత దర్శకుడూ – సన్నివేశానికి అనుగుణంగా మంచి వరసను కుదర్చడానికే ఆలోచిస్తాడు. కాని, ఇవాళ చాలా మంది నిర్మాతలు వ్యవధి ఇవ్వడం లేదు. మూడు రోజులుండనగా, రికార్డింగ్ కు తేదీ నిర్ణయం చేసి, స్టూడియో 'బుక్' చేసి – అప్పుడు పాట విషయం ఆలోచించమంటారు. లేకపోతే ఫలానా హిందీ చిత్రంలోని ఫలానా పాటను తీసుకోమంటారు. ఒక చిత్రానికి సంగీత దర్శకుని నిర్ణయం చేసుకున్న తర్వాత, అతనికి ఎలాంటి సూచనలు, సలహాలూ తదితరులు ఇచ్చినా – తుది నిర్ణయం మాత్రం సంగీత దర్శకుడికే వదిలిపెట్టాలి. అలా వదిలిపెట్టడం లేదు – అదే దురదృష్టం. 'సంగీత దర్శకుడు' అన్న తర్వాత కనీసం, ఆ పేరుకైనా గౌరవం ఇవ్వాలి గదా. లేకపోతే 'సంగీతపు మేస్త్రీ' అనో, 'మ్యూజిక్ ఎడిటర్' అనో పేరు

పేట్టి, గ్రామఫోన్ రికార్డులు ఇచ్చి చెయ్యమంటే బాగుంటుంది ! ఒకరికి ఇబ్బంది కలిగించాలనే ఉద్దేశంతో నేను – ఈ విషయాలు చెప్పడం లేదు. 'చిత్ర పరిశ్రమ అభివృద్ధి' కే చెబుతున్నాను.

సన్నివేశం అనుమతిస్తే వీలైనంతవరకూ శాస్త్రీయ ధోరణిలో పాట చెయ్యడమే బావుంటుందని నా ఉద్దేశం. ఆ పాట చాలా కాలం నిలుస్తుంది. 'సన్నివేశం బాగున్నప్పుడే పాట ప్రచారంలోకి వస్తుంది.' అని కొందరు అంటారు. కాని ఇది పూర్తిగా నిజం కాదు. పాటలో కూడా కొంత వుండాలి. సాహిత్యం, సంగీతం రెండూ ఆ సన్నివేశానికి తోడ్పడాలి. సంగీత సాహిత్యాలలో 75 శాతం సాహిత్యం, 25 శాతం సంగీతం వుండాలని నా అభిప్రాయం. ఉంటే, అది ప్రజాదరణ పొందగలుగుతుంది. అయితే ఇంకోటుంది – ప్రజాదరణ పొందాలని, 'పాప్యులర్' కావాలనీ అనుకుని పాట చెయ్యకూడదు. మనం చేసేది మనం చెయ్యాలి. అన్నీ కలిసి వచ్చి, అది రాణిస్తే ప్రజాదరణ పొందుతుంది. ముందే 'పాప్యులర్' కావాలని బయల్దేరితే, అది సన్నివేశానికి అతక్క, ఇంకోలా తయారయ్యే ప్రమాదం వుంది. ఏమైనా, పాట రాణించడానికి ఒక్క సంగీతమే ఎప్పుడూ కారణం కాదు. ఎన్నో కారణాలుంటాయి. ముఖ్యంగా సాహిత్యం బాగుండాలి. సాహిత్యం భర్త, సంగీతం భార్య. ఈ రెండూ కలిసి మెలిసి సరిగ్గా కాపురం చేస్తేనే మంచి 'సంతానం' కలుగుతుంది" అన్నారు వెంకటేశ్.

COMMENTS